

'లేపాక్షి నంది'తో పోస్ట్‌కార్డు విడుదల



స్టాంపును విడుదల చేస్తున్న తపాలా అధికారులు

ప్రజాశక్తి-లేపాక్షి

లేపాక్షిలో శుక్రవారం నంది విగ్రహంతో కూడిన శాశ్వత తపాలా ముద్రను, వీరభద్రస్వామి దేవస్థానంపై ప్రత్యేక పోస్ట్ కార్డులను సిపిఎంజి ప్రకాష్ విడుదల చేశారు. వారు మాట్లాడుతూ తపాలా ముద్రణతో లేపాక్షి నంది విశిష్టత ప్రపంచ నలుమూలలా విస్తరిస్తుందన్నారు. లేపాక్షి నంది చిత్రంతో పాటు ఆలయంలోని వేలాడే స్తంభం, వినాయకుడు, ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం చిత్రాలతో పోస్ట్ కార్డులు ముద్రించారన్నారు. వీటి పోస్టు కార్డులు పోస్ట్ ఆఫీస్‌లో అందుబాటులో ఉంటాయన్నారు. కార్యక్రమంలో కర్నూల్ రీజినల్ పోస్ట్ మాస్టర్ జనరల్ డాక్టర్ వెన్నం ఉపేంద్ర, పోస్టల్ సూపరింటెండెంట్ విజయకుమార్, లేపాక్షి పుస్తక రచయిత చిదంబరరెడ్డి, పోస్టల్ శాఖ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అభివృద్ధి, ఉపాధి దిశగా అడుగులు



ప్రసంగిస్తున్న మంత్రి నారా లోకేష్

- ◆ రెన్యూ ఏర్పాటుతో అనంత అభివృద్ధి
- ◆ క్లీనర్, గ్రీనర్, గ్రేటర్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యసాధనే మా విజన్
- ◆ రాష్ట్ర విద్య, ఐటి శాఖ మంత్రి నారా లోకేష్

ప్రజాశక్తి-గుత్తి

అభివృద్ధి, యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేలా రాష్ట్రంలో పరిశ్రమల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తున్నట్లు రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ తెలియజేశారు. అనంతపురం జిల్లా గుంతకల్లు నియోజకవర్గం గుత్తి మండల పరిధిలోని బేతపల్లి గ్రామంలో రూ.22వేల కోట్లతో రెన్యూ పవర్ సంస్థ స్థాపించనున్న 4.8 గిగావాట్ల హైబ్రిడ్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టు పనులను శుక్రవారం ప్రారంభించారు. రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, గుంతకల్ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, రెన్యూ సంస్థ ఛైర్మన్, సీఈవో సుమంత్ సిన్హా, కలెక్టర్ డా॥వి.వినోద్ కుమార్‌తో కలిపి నారా లోకేష్ శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అక్కడే జెసిబితో మట్టి తీసి పనులను ప్రారంభించారు.అనంతరం ఏర్పాటు చేసిన సభలో ప్రజలనుద్దేశించి మంత్రి నారా లోకేష్ ప్రసంగించారు. రూ.22వేల కోట్ల పెట్టుబడితో చేపట్టే ఈ ప్రాజెక్ట్ గ్రిడ్‌లకు శక్తినివ్వడమే కాకుండా, నిరుద్యోగ యువత ఆశయాలకు వారధిగా ఉంటుందన్నారు. ఎపి క్లీన్ ఎనర్జీ పాలసీ హరితవిప్లవానికి బ్లూ ప్రింట్ లాంటిదన్నారు. గ్రీన్ పవర్ హౌస్‌గా మారుతున్న ఆంధ్రప్రదేశ్‌పై నమ్మకంతో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు వచ్చిన రెన్యూ ఛైర్మన్, సిఇఓ సుమంత్ సిన్హా, సంస్థ బందంకు ప్రభుత్వం నుంచి అన్ని విధాలా సహాయక సహకారాలు అందిస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేవలం రోడ్లు, మౌలిక సదుపాయాలను నిర్మించడానికే పరిమితం కాకుండా పరిశ్రమలను ఏర్పాటు చేస్తూ రేపటితరం భవిష్యత్తుకు బంగారుబాటలు వేస్తున్నారని చెప్పారు. 2029 నాటికి 72 గిగావాట్ల పునరుత్పాదక శక్తిని సాధించాలన్న లక్ష్యంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. క్లీనర్, గ్రీనర్, గ్రేటర్ ఆంధ్రప్రదేశ్ తమ విజన్ అన్నారు. కాలుష్య వారసత్వాన్ని వదిలేసి భవిష్యత్ తరాలకు క్లీన్ ఎనర్జీని అందించే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామని తెలియజేశారు.

పారిపోయిన పరిశ్రమలన్నీ తిరిగి వస్తున్నాయ్

గత వైసిపి హయాంలో అప్పటి పాలకుల దెబ్బకు పారిపోయిన పరిశ్రమలు అన్నీ కూటమి ప్రభుత్వం రాగానే మళ్లీ రాష్ట్రానికి వస్తున్నాయని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. రెన్యూ ఇంటిగ్రేటెడ్ ఎనర్జీ కాంప్లెక్స్ ద్వారా స్థానిక యువత, రైతులకు మేలు జరుగుతుందన్నారు. జగన్ పాలనలో ఒక్క మెగావాట్ అదనపు విద్యుత్ రాష్ట్రంలో ఉత్పత్తి కాలేదన్నారు. చంద్రబాబుగారి నేతత్వంలో పునరుత్పాదక ఇంధన రంగానికి మళ్లీ గత వైభవం వచ్చిందని తెలియజేశారు. సాధ్యమైనంత త్వరగా నిర్మాణం పూర్తిచేసి యువతకు ఉద్యోగాలు కల్పించాలని మంత్రి రవికుమార్ రెన్యూ సంస్థను కోరారు. రెన్యూ సంస్థ ఛైర్మన్ సుమంత్ సిన్హా మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబు ఆశయ సాధనలో తాము భాగస్వాములం అవుతామన్నారు. ఎపిలో సింగిల్ విండో అనుమతులు, ఈజ్ ఆఫ్ డూయింగ్ విధానాలు పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని నింపుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో రెన్యూ సోలార్ సీనియర్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ ఎం.శివప్రసాద్, రెన్యూ సర్వీసెస్ బిజినెస్ అండ్ విండ్ ప్రాజెక్ట్స్ సిఓఒ, గ్రూప్ ప్రెసిడెంట్ బలరామ్ మెహతా, కళ్యాణదుర్గం ఆర్డీవో వసంత బాబు, గుత్తి తహశీల్దార్ ఓబులేసు, ఎంగన్నపల్లి సర్పంచి పి.భరత్ కుమార్, ఎంపీటీసీ ఎం.ధనంజయ, సంస్థ ప్రతినిధులు ప్రకాష్ బాబు,పృథ్వీ,ఆర్.రాజా తదితరులు పాల్గొన్నారు.



రెన్యూపవర్ ఇంటిగ్రేటెడ్ ప్రాజెక్టుకు సంబంధించిన ఎంఓయు పత్రాలతో లోకేష్, రెన్యూ ఛైర్మన్



విద్యుత్ దీపాలంకరణలో స్నాతకోత్సవం జరగనున్న ఆడిటోరియం



స్నాతకోత్సవం జరిగే ఆడిటోరియం భవనం

జెఎన్‌టియు స్నాతకోత్సవానికి వేళాయే..!

- ◆ నేడు ఎన్టీఆర్ ఆడిటోరియంలో వేడుక ◆ హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్ ◆ డాక్టర్ సత్యనారాయణ చావకు గౌరవ డాక్టరేట్
- ◆ ముఖ్యఅతిథిగా ఐఐటి కాన్పూర్ విశ్రాంత ఆచార్యులు ఎంఆర్.మాధవ్ ◆ 41 మందికి బంగారు పతకాలు
- ◆ 40,109 మంది యూజీ, పీజీ విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం ◆ అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం : విసి హెచ్.సుదర్శన్ రావు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

14వ స్నాతకోత్సవ వేడుకలకు అనంతపురం జెఎన్‌టియు ముస్తాబైంది. శనివారం ఉదయం జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఛాన్సలర్ హోదాలో పాల్గొంటారు. స్నాతకోత్సవాన్ని విజయవంతం చేయడానికి అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేసినట్టు జెఎన్‌టియు వైస్ ఛాన్సలర్ సుదర్శన్ రావు తెలిపారు. శుక్రవారం ఉదయం స్థానిక ఆర్యభట్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పూర్తి వివరాలను వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాలు ఈ విధంగానున్నారు.

40,109 మందికి డిగ్రీలు ప్రధానం

అనంతపురం జెఎన్‌టియు పరిధిలోనున్న అన్ని కళాశాలకు సంబంధించి బీటెక్, ఎంటెక్, ఎం ఫార్మసి, ఎంబిఎ పూర్తి చేసిన 40,109 మంది యుజి, పిజి విద్యార్థులకు డిగ్రీలను ప్రదానం చేయనున్నారు. ఇందులో పరిశోధన డిగ్రీలు 167 కాగా, డాక్టర్ ఆఫ్ ఫార్మసి 361 మంది ఉన్నారు. ఎంటెక్, ఎంఫార్మసి, ఎంబిఎ పూర్తి చేసిన వారు 9,564 మంది ఉన్నారు. బీటెక్, బీఫార్మసి విద్యార్థులు 30,017 మంది ఉన్నారు.

41 మందికి బంగారు పతకాలు

ఉత్తమ ప్రతిభ కనబరచిన 41 మందికి బంగారు పతకాలను ప్రదానం చేయనున్నారు. ఇందులో మెకానికల్ విభాగంలో నంద్యాలకు చెందిన పూరిత్ కుమార్‌రెడ్డి ఏకంగా ఆరు బంగారు పతకాలు సాధంచారు. కంప్యూటర్ సైన్సులో ప్రతిభ కనబరచిన తయ్యూరు సుప్రజకు నాలుగు బంగారు పతకాలు వచ్చాయి. బంగారు పతకాలు సాధించిన వారందరికీ గవర్నర్ చేతులు మీదుగా అందజేస్తారు.

ముఖ్య అతిథులు : 14వ స్నాతకోత్సవానికి ఐఐటి కాన్పురు విశ్రాంత అధ్యాపకులు ఎంఆర్.మాధవ్ పాల్గొని సందేశాన్ని ఇవ్వనున్నారు. లారస్ ల్యాబ్ వ్యవస్థాపకులు డాక్టర్ సత్యనారాయణ చావకు 14వ స్నాతకోత్సవం సందర్భంగా జెఎన్‌టియు గౌరవ డాక్టరేట్‌ను అందించనున్నారు.

స్నాతకోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి : వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు



విలేకరులతో మాట్లాడుతున్న జెఎన్‌టియు విసి

జెఎన్‌టియు 14వ స్నాతకోత్సవానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేశామని వైస్ ఛాన్సలర్ హెచ్.సుదర్శనరావు తెలిపారు. స్నాతకోత్సవ ఏర్పాట్లపై శనివారం నాడు వర్సిటీ పరిపాలన భవనంలోని ఆర్యభట్ట ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు హాజరవుతున్న నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. రాష్ట్ర గవర్నర్, ఛాన్సలర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ సమక్షంలో స్నాతకోత్సవ కార్యక్రమం జరుగుతుందని తెలియజేశారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బంగారు పతకాలు, పిహెచ్‌డి డిగ్రీలు అందజేస్తామన్నారు. కార్యక్రమం విజయవంతం అయ్యేలా అందరూ సహకరించాలని ఆయన కోరారు. స్నాతకోత్సవ ఆహ్వానితులు అందరూ సమయానికి విచ్చేసి క్రమశిక్షణతో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఆహ్వానితులకు మాత్రమే అనుమతి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, అకడమిక్ ప్లానింగ్ డైరెక్టర్ ఆచార్య ఎస్‌వి.సత్యనారాయణ, అకడమిక్ ఆడిట్ డైరెక్టర్ ఆచార్య దుర్గాప్రసాద్, పరీక్షల విభాగం డైరెక్టర్ ఆచార్య నాగప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

అట్రాసిటీ కేసు నమోదు చేయండి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

బ్రహ్మసముద్రం మండలం కుర్లకుంట గ్రామంలో దళిత మహిళలపై దాడి చేసిన పెత్తందారులపై హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు నమోదు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప డిమాండ్ చేశారు. శుక్రవారం గణేనాయక్ భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాల రంగయ్యతో కలిసి పాత్రికేయులతో ఆయన మాట్లాడారు. బుధవారం నాడు బ్రహ్మసముద్రం మండలం కుర్లకుంటకు గ్రామానికి చెందిన దళితులైన మమత, రాధమ్మ, తులసి అనే మహిళలు వ్యవసాయ పనులకు వెళ్లి వస్తూ రాలిపోయిన మామిడి పండ్లు తిన్నారనే అక్కసుతో యాటకల్లు గ్రామానికి చెందిన కొందరు సుమారు ఐదు గంటలసేపు తోటలో మహిళను బంధించి కులం పేరుతో దూషిస్తూ వారిని ఇష్టానుసారం కొట్టారని తెలిపారు. ఈ విషయాలు గ్రామంలో ఎవరికీ చెప్పకూడదని బెదిరించడం పెత్తందారుల కుల దురహంకారానికి, అరాచకాలకు నిదర్శనం అన్నారు. మహిళలపై దాడి చేసిన వారందరిపై ప్రభుత్వం వెంటనే హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసును నమోదు చేసి కఠినంగా శిక్షించాలన్నారు. కలెక్టర్, ఎస్పీ, సాంఘిక సంక్షేమ అధికారులు వెంటనే ఆ గ్రామాన్ని సందర్శించి బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్నారు. నష్ట పరిహారం ఇవ్వాలని, పెత్తందారులు ఆగడాలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బాధిత కుటుంబాలకు సాంఘిక సంక్షేమ ఉప సంచాలకులు గ్రామాన్ని సందర్శించి భరోసా కల్పించాలన్నారు.

రూ.30కోట్లతో అనంత రైల్వే స్టేషన్ అభివృద్ధి

రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న

ప్రజాశక్తి-అనంతపురం

రైల్వే స్టేషన్ల అభివృద్ధిలో భాగంగా అనంతపురం రైల్వే స్టేషన్‌ను రూ.30 కోట్లతో ఆధునీకరిస్తున్నట్లు కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమన్న తెలిపారు. శుక్రవారం జిల్లా పర్యటనకు విచ్చేసిన ఆయన ఎంపీ అంబికా లక్ష్మీనారాయణతో కలిసి అనంతపురం రైల్వే స్టేషన్‌ను పరిశీలించారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి రైల్వే అధికారులతో అడిగి తెలుసుకున్నారు. పనులను వేగతవంతం చేసి, అనుకున్న సమయంలోపు పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అనంతపురం ప్రాంతానికి మరిన్ని రైలు సర్వీసులు అందుబాటులోకి రావడం, రైల్వే మౌలిక సదుపాయాల ఆధునికీకరణ వంటి అంశాల్లో కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఢిల్లీకి వెళ్లే రాజధాని ఎక్స్‌ప్రెస్‌ను అనంతపురంలో ఆపాలన్నారు. ధర్మవరం - మచిలీపట్నం రైలుకు రాయచెరువు స్టేషన్లో నిలపాలన్నారు. వీటిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి త్వరితగతిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గుంతకల్ డిఆర్ఎం, రైల్వే కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అనంతపురం రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కేంద్ర మంత్రి సోమన్న

రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి నిర్మించండి

ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ - రైల్వే సహాయ మంత్రికి వినతి అందజేత



కేంద్ర మంత్రి సోమన్నతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-అనంతపురం

రాప్తాడు, ధర్మవరం నియోజకవర్గాల్లో అవసరమైన చోట రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్‌లు రైల్వే సహాయ మంత్రి సోమన్నను కోరారు. పలు కార్యక్రమాల్లో పాల్గొనేందుకు రైల్వే సహాయ మంత్రి శుక్రవారం నాడు జిల్లాకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన అనంతపురంలోని పరిటాల సునీత ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా ధర్మవరం నియోజకవర్గంలో రైల్వే విభాగానికి సంబంధించిన అంశాలపై ఎమ్మెల్యే సునీత వినతి పత్రం అందజేశారు. ధర్మవరం నుంచి నాగసముద్రం మధ్య డబ్లింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో చైనేజ్ 171/600 వద్ద ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ ప్రాంతం చుట్టుపక్కల ఇందిరమ్మ కాలనీ, కేతిరెడ్డి కాలనీ, టిడ్కో గహాలు, రేగాటిపల్లి గ్రామాల ప్రజలు, రైతులు, వ్యవసాయ కూలీలు రాకపోకలు సాగిస్తుంటారని చెప్పారు. లెవల్ క్రాసింగ్ గేట్ ఏర్పాటు చేయకపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పరిస్థితుల్లో ఆ ప్రాంతాల్లో ఫుట్ ఓవర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేయాలని కోరారు. కదిరిదేవరపల్లి రైలులో పావగడ, కళ్యాణదుర్గం నియోజకవర్గాల ప్రజలు తిరుపతికి వెళ్లాలంటే కంబదూరు, కళ్యాణదుర్గం, రాయదుర్గం, బళ్లారి, గుంతకల్లు, అనంతపురం మీదుగా ధర్మవరానికి 260 కిలోమీటర్లు దూరం చుట్టి రావాల్సి వస్తోందన్నారు. అలా కాకుండా కంబదూరు నుంచి పేరూరు, రామగిరి మీదుగా నాగసముద్రం గేట్ వరకు కొత్త రైల్వే లైన్ వేస్తే సుమారు 200 కిలోమీటర్లు పైగా దూరం తగ్గుతుందన్నారు. కంబదూరు-నాగసముద్రం మార్గంలో కొత్త రైల్వే లైన్ మంజూరు చేయాలని కోరారు. వీటిపై రైల్వే ఉన్నతాధికారులతో చర్చిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు.

పరిటాల ఇంటికి విమానయాన శాఖ మంత్రి

కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామమోహన్ నాయుడు గురువారం నాడు అనంతపురంలోని పరిటాల నివాసానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయనకు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థలు పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కొంత సేపు రామమోహన్ నాయుడు పరిటాల శ్రీరామ్‌తో జిల్లా రాజకీయాలు, ఇతర విషయాలపై మాట్లాడారు.

జులై 10లోపు హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ వెడల్పు పనులు పూర్తి

ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్



హంద్రీనీవా పనులను పరిశీలిస్తున్న ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజాశక్తి-ఉరవకొండ

వచ్చే జూలై 10వ తేదీకి హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను పూర్తి చేస్తామని ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కౌకుంట్ల వద్ద 204 కిలోమీటర్ల నుంచి 210 కిలోమీటర్ల మధ్య హంద్రీనీవా కాలువ వెడల్పు పనులను మంత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ కాలువ వెడల్పు పనులు నెమ్మదిగా చేపట్టడంపై హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, కాంట్రాక్టర్లపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి చెప్పిన దాని ప్రకారం వెడల్పు పనులను వేగవంతంగా చేపట్టాలన్నారు. కాలువ వెడల్పు పనులు, బ్రిడ్జి పనులు, మట్టి తొలగింపు, అన్ని రకాల పనులు సకాలంలో త్వరితగతిన పూర్తి చేయడంపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో సీఎం తెలిపిన విధంగా జూలై 10వ తేదీ నాటికి ఖచ్చితంగా పనులు పూర్తి చేయాలని, ఎలాంటి నిర్లక్ష్యం ఉండరాదన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు, కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

హంద్రీనీవాపై ప్రత్యేక దృష్టి

పనుల పూర్తికి ముఖ్యమంత్రి చర్యలు
రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాయలసీమ జీవనాడి హంద్రీనీవా సుజల స్రవంతి నిర్మాణం పనులు వేగవంతం చేసి, త్వరితగతిన ప్రాజెక్టును పూర్తి చేసేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పట్టుదలగా ఉన్నారని రాష్ట్ర జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. శుక్రవారం ఆయన ధర్మవరం నియోజకవర్గం ముదిగుబ్బ మండల పరిధిలోని మలకవేమల వద్ద హంద్రీనీవా ప్రధాన కాలువ పనులను జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఇరిగేషన్ అడ్వయిజర్ వెంకటేశ్వరరావుతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆయన అధికారులతో పనుల పురోగతి గురించి అడిగి తెలుసుకున్నారు. హంద్రీనీవా ప్రాజెక్టులో ఫేజ్ - 1, 2 కింద 554 కి.మీ. మేర కాలువ లైనింగ్, వెడల్పు పనులకు మొత్తం రూ.3,873 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు చేస్తోందన్నారు. ప్రాజెక్టు పూర్తయితే ఫేస్-1 కింద కర్నూలు జిల్లాలో 77,094, నంద్యాల జిల్లాలో 2,906, అనంతపురం జిల్లాలో 1,18,000 ఎకరాలు మొత్తం 1,98,000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఫేజ్-2 కింద అనంతపురం జిల్లాలో 33,617, సత్యసాయి జిల్లాలో 1,93,383, కడప జిల్లాలో 37,500, చిత్తూరు జిల్లాలో 1,40,000 ఎకరాలు కలిపి మొత్తం 4,04,500 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, చిత్తూరు జిల్లాల్లో 6,02,500 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని చెప్పారు. 81 మండలాల్లో 33 లక్షల మందికి తాగు నీటి సరఫరాకు అవకాశం లభిస్తుందని తెలిపారు. హంద్రీనీవా పనుల నాణ్యత విషయంలో రాజీపడకుండా చేయించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహేష్, ఇంజినీర్లు సీఈ నాగరాజు, స్వరూప్ కుమార్, మురళి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నారా లోకేష్‌కు భారీ గజమాలతో స్వాగతం పలుకుతున్న అనంతపురం తెలుగుదేశం పార్టీ శ్రేణులు

అనంతలో నారా లోకేష్‌కు ఘనస్వాగతం

ఎమ్మెల్యే దగ్గుపాటి ఆధ్వర్యంలో ఏర్పాట్లు


ప్రజాశక్తి-అనంతపురం

జిల్లా పర్యటనలో భాగంగా అనంతపురం అర్బన్ నియోజకవర్గానికి విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి నారా లోకేష్‌కు టిడిపి శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ఆధ్వర్యంలో స్వాగతం పలికి అభిమానం చాటుకున్నారు. తపోవనం సర్కిల్లో ఎమ్మెల్యే దగ్గుపాటి రెండు భారీ గజమాలలు వేసి స్వాగతం పలికారు. అనంతరం మంత్రి శ్రీనగర్ కాలనీలోని జిఎంఆర్ కాంపౌండ్‌లో జరిగిన కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహ వేడుకకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఆ తర్వాత ఇటీవల మరణించిన మాజీ ఎంపీ సైఫుల్లా కుమారుడు కెఎం.జఖీవుల్లా కుటుంబ సభ్యులను మంత్రి పరామర్శించారు. జఖీవుల్లా చిత్రపటం వద్ద పూలు ఉంచి నివాళులు అర్పించారు. జఖీవుల్లా తండ్రి మాజీ ఎంపీ కెఎం.సైఫుల్లా ఇతర కుటుంబసభ్యులను పరామర్శించారు. పార్టీ తరపున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

వైభవంగా ఎమ్మెల్యే సురేంద్రబాబు కుమార్తె వివాహం

ప్రజాశక్తి-అనంతపురం

కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కుమార్తె వివాహం వైభవంగా జరిగింది. ఈ వివాహ వేడుకలో ప్రముఖులతోపాటు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు. కేంద్ర రైల్వే సహాయక మంత్రి సోమన్న, విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర ఐటి శాఖ మంత్రి నారా లోకేశ్, ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెంనాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, బిసి సంక్షేమ, చేనేత శాఖ మంత్రి సవితమ్మ, విప్ కాలవశ్రీనివాసులు, ఎంపిలు పార్థసారధి, అంబిక లక్ష్మీనారాయణలతోపాటు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, జిల్లా ప్రజాప్రతినిధులతోపాటు సిడబ్ల్యుసి సభ్యులు ఎన్.రఘువీరారెడ్డి, వైసిపి జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి, ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.



వధూవరులు, అమిలినేని కుటుంబ సభ్యులతో మంత్రి నారా లోకేష్

ఋతుపవనాలకు ముందు వేసే పంటలే నేలకు సారం

ప్రకృతి వ్యవసాయ శాఖ విభాగం సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్

ప్రజాశక్తి-ఉరవకొండ

ఋతు పవనాలకు ముందు వేసే పంటలతో నేలలు సారవంతంగా ఉంటాయని ప్రకృతి వ్యవసాయ శాఖ విభాగం సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్ అన్నారు. ప్రకృతి వ్యవసాయ శాఖ డిపిఎం లక్ష్మానాయక్ ఆదేశాల మేరకు ఉరవకొండ మండలం లోని రాకెట్ల తండా గ్రామంలో ఎకరా పొలంలో సాగుపై అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా ఎకరా పొలంలోనే ఆముదం, సజ్జ, కంది, గోరుచిక్కుడు, అనుములు పంటలతోపాటు 20 రకాల జీవవైవిధ్య పంటలను రైతులతో వేయించారు. ఈ పంటల ద్వారా నేల సారవంతమై తద్వారా ఖరీఫ్ లో వేయబోయే పంటల దిగుబడి అధికంగా వచ్చి రైతులు అధిక లాభాలు పొందుతారని సూచించారు. ఉరవకొండ డివిజన్‌లో అన్ని ప్రకృతి వ్యవసాయ గ్రామంలో రైతులతో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ డివిజన్ మాస్టర్ ట్రైనర్ ఎం.ధనుంజయ, ఉరవకొండ మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



విత్తనాలపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాఖ విభాగం సీనియర్ ప్రోగ్రాం మేనేజర్ నవీన్నవీన్

సూర్యప్రభ వాహనంపై ఊరేగిన పెన్నోబిలేసుడు

ప్రజాశక్తి-ఉరవకొండ

పెన్నఅహోబిలంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రం సూర్యప్రభ వాహనంపై స్వామివారు ఊరేగారు. ముందుగా లక్ష్మీ నరసింహస్వామి మూలవిరాట్‌కు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవారి ఉత్సవమూర్తులను వాహనంపై కొలువుదీర్చి ఊరేగించారు. స్వామివారి వాహనసేవను చూసేందుకు వచ్చిన భక్తులతో పెన్న అహోబిలం కిటకిటలాడింది. ఈ కార్యక్రమంలో ఆలయ ఇఒ సాకే రమేష్‌బాబు, అర్చకులు ద్వారకనాథ్ స్వామి, బాలాజీస్వామి, ఉత్సవదాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న పెన్నోబిలేసుడు

పట్టు వస్త్రాలు వితరణ

లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నింబగల్లు గ్రామానికి చెందిన లక్కవరం కృష్ణయ్య, సుంకమ్మ దంపతులతోపాటు కుటుంబ సభ్యులు తమిళనాడు రాష్ట్రంలోని కాంచీపురంలో రూ.లక్ష విలువజేసే నూతన వస్త్రాలను తయారు చేయించి ఆలయ కార్యనిర్వాహణాధికారి సాకే రమేష్‌బాబు ఆధ్వర్యంలో శుక్రవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

ప్రజాశక్తి-నార్పల

మండల కేంద్రం సమీపంలోని క్రాసింగ్‌లో ఉన్న కాఫీ టైం కేఫ్‌లో అబ్దుల్‌కలాం స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి అపూర్వ స్పందన లభించింది. ముందుగా వీరమరణం పొందిన ఆర్మీ జవాన్ సుబ్బయ్య భార్య లీలావతి, కుటుంబ సమేతంగా రక్తదాన శిబిరానికి వచ్చి సుబ్బయ్య, మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లీలావతి మాట్లాడుతూ దేశం కోసం ప్రాణాలర్పించిన తన భర్త సుబ్బయ్య, ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలు కోల్పోయిన మురళీనాయక్ కోసం మానవతా దృక్పథంతో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. పీటలు విజయ్ మాట్లాడుతూ రక్తదాన శిబిరంలో 123 యూనిట్ల రక్తాన్ని ఇవ్వడం సంతోషమన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి రెడ్‌క్రాస్ తరపున ప్రశంసాపత్రం, రూ.లక్ష బీమా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గవ్వల శివ, బూసి దిలీప్, రాయల్ దిలీప్, ఎట్టి తిరుపాల్, బూసి అశోక్, సైఫుల్లా, గవ్వల సతీష్, దాతలు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న వీరజవాన్ సతీమణి లీలావతి

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి..!

ప్రజాశక్తి-యల్లనూరు

మండల కేంద్రం సమీపంలోని పాతపేట సచివాలయం-2 వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సు షెల్టర్ లేకపోవడంతో ఎండకు ఎండి వానకు తడుస్తూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోతున్నారు. ఎన్నికల ముందు ప్రతి పార్టీ నాయకులూ తాము గెలిస్తే బస్సు షెల్టర్ ఏర్పాటు చేస్తామని హామీ ఇస్తారు తప్ప చేసింది మాత్రం శూన్యమని ఆరోపిస్తున్నారు. బసు షెల్టర్‌తోపాటు కుర్చీలు లేకపోవడంతో ఎండకు నిలబడి ఇబ్బందులకు గురవుతున్నామని చెబుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పాతపేట సచివాలయం-2 వద్ద బస్సు షెల్టర్ ఏర్పాటు చేసి ప్రయాణికుల ఇబ్బందులను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.




బస్ సెల్టర్ లేక కింద కూర్చున్న మహిళలు

జనసేన నర్సాపురం ఎమ్మెల్యేకు సన్మానం

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురంలోని రామ్‌నగర్‌లో ఉన్న జనసేన పార్టీ కార్యాలయానికి విచ్చేసిన నరసాపురం ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్‌కు జనసేన జిల్లా అధ్యక్షులు, అహుడా ఛైర్మన్ టిసి వరుణ్ ఘనంగా సత్కరించారు. అనంతరం తాజా రాజకీయ పరిస్థితులపై జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డితో కలిసి తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు పొదిలి బాబురావు, భవాని రవికుమార్, జయరామ్‌రెడ్డి, పత్తి చంద్రశేఖర్, రాపా ధనంజయ, సంజీవరాయుడు, సిద్ధు, జయమ్మ, అవుకు విజయకుమార్, గ్రంధి దివాకర్, మేదర వెంకటేష్, హుస్సేన్, విశ్వనాథ్, లాల్‌స్వామి, నెట్టికంటి హరీష్, ఆకుల అశోక్, కృష్ణ, సంతోష్, చిన్న, వీరమహిళలు అనసూయ, దాసరి సరిత, శైలజ, మంజుల, శరణ్య, నాయకులు చిరు, ప్రసాద్, బళ్లారి అనిల్, సిద్ధూ, రమణ, నాగార్జున, తోట రామ్మోహన్, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.



నర్సాపురం ఎమ్మెల్యేను సన్మానిస్తున్న జిల్లా జనసేన నాయకులు

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

ప్రజాశక్తి-యాడికి

ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి జన్మదిన సందర్భంగా ఆయన అభిమానుల ఆధ్వర్యంలో శుక్రవారం మండల కేంద్రంలోని జిల్లా ప్రజా పరిషత్ క్రీడా మైదానంలో ఏర్పాటు చేసిన క్రికెట్ టోర్నమెంట్‌ను బీసీ సెల్ మండల అధ్యక్షులు నీలకంఠ ప్రారంభించారు. ముందుగా క్రీడాకారుల సమక్షంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. టోర్నమెంట్‌కు 40 జట్లు రిజిస్ట్రేషన్ చేసుకోగా ప్రారంభ మ్యాచ్ వీరారెడ్డిపల్లి, మేకలపల్లి జట్లు తలపడ్డాయి. ఈ కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ రుద్రమనాయుడు, టౌన్ ప్రెసిడెంట్ వెలిగండ్ల ఆదినారాయణ, లియో విశ్వనాథ్, గుండా నారాయణ స్వామి, శేఖర్, సుభహాన్ పాల్గొన్నారు.

యాడికి : ఎమ్మెల్యే జెసి అస్మిత్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో జెసి ఫ్యామిలీ వీరాభిమాని, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గండికోట లక్ష్మణ్ ఆధ్వర్యంలో పలు వృద్ధాశ్రమాల్లో అన్నదానాలు చేశారు. ఈ సందర్భంగా కేకులు కోసి పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో గండికోట లక్ష్మణ్ మిత్ర బృందం పాల్గొన్నారు.

గూగూడులో అసాంఘిక కార్యకలాపాలు!

మితిమీరిపోతున్న జూదరులు-మద్యం మత్తులో హల్‌చల్

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామానికి ఎంతో ఘన చరిత్ర ఉంది. గ్రామంలో వెలిసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు రాష్ట్రంలోనే మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయి. ప్రతి ఏడాది ఏడాదికి ఒక్కసారి పది రోజులపాటు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతాయి. ఈ ఉత్సవాలను వేడుకను తిలకించడానికి రాష్ట్రం నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుండి లక్షలాది మంది తరలివస్తారు. ఉత్సవాలతోపాటు ఏడాది పొడవునా ప్రతి గురు, శుక్ర, ఆది, మంగళవారాల్లో కూడా కుళ్లాయిస్వామి దర్శనానికి అధిక సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఈ సందర్భంగా జంతుబలులు ఇచ్చి కందూరులు చేస్తుంటారు.



అయితే ఆయా కార్యక్రమాలకు వచ్చేవారు మద్యం తాగడం, బహిరంగంగా పేకాటతోపాటు పలు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం పరిపాటిగా మారింది. దీనికితోడు గూగూడులో మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో మద్యం ఏరులై పారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో సామాన్య భక్తులు, మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జూన్ 27న కుళ్లాయిస్వామి స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి గూగూడు పవిత్రతను కాపాడటంతోపాటు భక్తుల మనోభావాలు దెబ్బతినకుండా గ్రామంలో మద్యం దుకాణం తొలగించాలని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని భక్తులు కోరుతున్నారు.

ఎరువులు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు

జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

ప్రజాశక్తి-అనంతపురం

జిల్లాలోని ఎరువుల దుకాణదారులు ఎంఆర్‌పి ధరలకు కాకుండా అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ హెచ్చరించారు. శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయ మీటింగ్ హాల్లో కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్, ఇఫ్కో కంపెనీ ఆధ్వర్యంలో ఎరువుల డీలర్లకు ఈ-పాస్ ఆధార్ బయోమెట్రిక్ మిషన్లు పంపిణీ చేశారు. అలాగే ఖరీఫ్ 2025-26లో ఎరువుల పంపిణీపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జెడిఎ మాట్లాడుతూ జిల్లా కేటాయించిన ఎరువులను ఎప్పటికప్పుడు సరఫరా చేయాలని ఎరువుల కంపెనీ ప్రతినిధులను ఆదేశించారు. ఎరువులను ఈపాస్ ద్వారా మాత్రమే విక్రయించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. గతంలో ఇచ్చిన ఈపాస్ మిషన్లకు సంబంధించి ఆధార్ బయోమెట్రిక్ సాఫ్ట్‌వేర్‌లో మారడం వల్ల లార్డ్ సర్వీస్ నుంచి ఎల్ 1ఆర్‌డి సర్వీస్ సంబంధించి ఈపాస్ మిషన్లు వచ్చాయన్నారు. జిల్లాకు 785 ఈపాస్ మిషన్లు కేటాయించినట్లు తెలిపారు. ఇఫ్కో కంపెనీల ద్వారా 169, స్పిక్ కంపెనీ ద్వారా 269, జిఏఫ్‌ఎల్ కంపెనీ ద్వారా 218, మహాధన్ కంపెనీ ద్వారా 129 మిషన్లు కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా మార్క్‌ఫెడ్ మేనేజర్ పెన్నేశ్వరి, అధికారులు విజయకుమార్, చెన్న వీరస్వామి, ఆర్.బాలానాయక్, వివిధ ఎరువులు, కంపెనీ సేల్స్ ఆఫీసర్లు, హోల్‌సేల్ ఎరువుల డీలర్లు సిరుగుప్ప వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారిణి యు.ఉమామహేశ్వరమ్మ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

మంత్రి నారా లోకేష్‌కు ఎస్‌ఎఫ్‌ఐ వినతి

ప్రజాశక్తి-గుత్తి

గుంతకల్లు నియోజకవర్గంలో నెలకొన్న విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు సి.రమేష్ కోరారు. శుక్రవారం గుత్తి పట్టణ శివారులో ఏర్పాటు చేసిన ప్రజాదర్బారులో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుత్తి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ, ఐటిఐ కళాశాలలో ఏర్పాటు చేయాలన్నారు. బేతాపల్లి గ్రామంలో ఉన్న ఉన్నత పాఠశాల భవనాలు ఇరుకుగా ఉన్నాయని , రెండు ఎకరాల స్థలం కేటాయించారని అందులో నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. గుంతకల్లులో పాలిటెక్నిక్ కళాశాలకు స్థలం కేటాయించారని నూతన భవనాన్ని ఏర్పాటు చేయాలన్నారు. గుంతకల్లులో నిర్మించిన మైనార్టీ, ఉర్దూ కళాశాల, హాస్టల్ భవనాలు ప్రారంభించాలన్నారు. గుంతకల్ పట్టణంలో బాలికల కోసం ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఏర్పాటు చేయాలన్నారు. వైటి చెరువు గ్రామంలో ఆగిన పాఠశాల పనులను పూర్తి చేయాలన్నారు. ఇసురాళ్లపల్లి గ్రామంలో బీసీ సంక్షేమ వసతి గృహానికి నూతన భవనాన్ని నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ పట్టణ అధ్యక్షుడు బాలాజీ, సహాయ కార్యదర్శి నవీన్ యాదవ్, డివైఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్, అనిల్ సాయి తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి సమస్యలను వివరిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకుల

చిన్నారి సుంకర నవనీకు నారా లోకేష్ అభినందన

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

జిల్లా పర్యటనలో భాగంగా గుత్తిలో ఏర్పాటు చేసిన ప్రజాదర్బార్‌లో అనంతపురంలోని కేంద్రీయ విద్యాలయంలో 3వ తరగతి చదువుతున్న సుంకర నవనీని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు. విద్యార్థి సుంకర నవని 'ఏక్ పెడ్ మాకే నాం' కార్యక్రమంలో భాగంగా తాను మొక్కలు నాటిన కార్యక్రమాన్ని వివరించింది. అంతేగాకుండా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ప్రతి ఆదివారం సెలవు దినాల్లో మొక్కలు నాటడం అలవాటుగా పెట్టుకుని ఇప్పటి వరకూ 117 మొక్కలను నాటానన్నారు. అంతేగాకుండా దాదాపు 1300 మొక్కలను తోటి మిత్రులకు, అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో పంచినట్లు తెలిపింది. అలాగే ట్రీ గార్డ్ ఫండ్ కోసం తాను పొదుపు చేసిన హుండీని మంత్రి నారా లోకేష్‌కు అందజేయగా స్పందించిన మంత్రి హుండీని నీవే తీసుకుని ఇంకా ఫండ్ వసూలు చేయమని మొక్కలు సంరక్షణకు నీవే వాడాలి అభినందించి సూచించారు. చిన్న వయసులోనే ప్రకృతి, పర్యావరణ పరిరక్షణపై సామాజిక స్పృహ కలిగి ఉండడం అభినందనీయమని నారా లోకేష్ అభినందించారు.



చిన్నారి నవనీతో మాట్లాడుతున్న మంత్రి నారా లోకేష్

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం

ప్రజాశక్తి-నార్పల

జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని సిద్ధరాచర్ల గ్రామంలో సర్పంచు సాకే రామాంజనేయులు ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా డెంగీ ఎలా వస్తుంది.. ఒకరి నుంచి ఇంకొకరికి ఎలా సోకుతుంది.. ఎలా నివారించాలనే విషయాలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాకే కుళ్లాయప్ప, ఎఎన్‌ఎం ఫరీదా భాను, ఇంజినీరింగ్ అసిస్టెంట్ మహేష్‌నాయుడు, మహిళా పోలీస్ భాగ్య, సాకే శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

అలాగే మండల పరిధిలోని బి.పప్పూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ సునీత ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఆరోగ్య పర్యవేక్షకులు ఎం.శ్రీరాములు, స్టాఫ్‌నర్స్ అంజలి, ఫార్మాసిస్ట్ రూబియా, టెక్నీషియన్ ఉషా, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

శింగనమల : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా ఇంట్లో నిల్వ నీటిని పరిశీలించండి.. శుభ్రపరచండి.. మూతలు పెట్టండి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా తరిమెల వైద్యాధికారి డాక్టర్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ డెంగీ వ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిహెచ్‌ఒ గంగాధర్, సూపర్‌వైజర్ అశ్వర్థ నారాయణ, ఎఎన్‌ఎంలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

యాడికి : మండల కేంద్రంతోపాటు రాయల చెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు దేవరాజు, డాక్టర్ అప్పయ్య, యాడికి డాక్టర్ సాయి సుమంత్‌రెడ్డి ఆధ్వర్యంలో డెంగీ నివారణ దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. అనంతరం యాడికి, రాయల చెరువు ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న ల్యాబ్‌లను తాడిపత్రి మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాసులు తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిహెచ్‌ఇఒ లక్ష్మన్న, సూపర్‌జర్లు గౌడ్, షబ్బీర్, ఎఎన్‌ఎంలు ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



శింగనమలలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

రాయదుర్గం : ప్రతి ఒక్కరూ తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని డెంగీ నుంచి కాపాడుకుందామని రాయదుర్గం వైద్యాధికారి యశ్వంత్, ఆరోగ్య విద్యా బోధకులు లక్ష్మీనారాయణ, మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేంద్రప్రసాద్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం రాయదుర్గంలోని రాజీవ్‌గాంధీ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న బిటిపి లేఅవుట్ పరిధిలో మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం డెంగీ నివారణపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు లక్ష్మీనరసమ్మ, శాంతకుమారి, ఆరోగ్య కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సిరీన్ ట్యుటోరియల్‌లో హిందీ తరగతులు

ప్రజాశక్తి-అనంతపురం

వేసవి సెలవుల రీత్యా స్థానిక గుల్జార్‌పేటలో స్పోకెన్ హిందీ ఆఫ్‌లైన్/ఆన్‌లైన్ తరగతులు నిర్వహిస్తున్నట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ పటాన్ సిరీన్‌ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ప్రజాశక్తితో ఆమె మాట్లాడుతూ 3వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకూ హిందీలో వెనుకబడిన వారికి ప్రత్యేకంగా శిక్షణ అందించి తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. 27ఏళ్ల సుదీర్ఘ అనుభవంతో వందశాతం ఫలితాలను అందిస్తున్నట్లు చెప్పారు. విద్యార్థుల సౌకర్యార్థం ఆన్లైన్ ఆఫ్ లైన్స్ సౌకర్యంలో శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. పూర్తి వివరాలకు మొబైల్ నెంబర్ 99667 09229ను సంప్రదించాలని కోరారు.

మేనేజింగ్ డైరెక్టర్ పఠాన్ సిరీన్ ఖాన్



విద్యుత్ తీగలు తొలగింపు

ప్రజాశక్తి కథనానికి స్పందన

యల్లనూరు : మండల పరిధిలోని కల్లూరు గ్రామ సమీపంలో చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నుంచి వస్తున్న పిబిసి కాలువపై ఉన్న విద్యుత్ తీగలను ఎట్టకేలకు అధికారులు తొలగించారు. 'పొంచి ఉన్న ప్రమాదం' పేరుతో శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు శుక్రవారం పిబిసి కాలువ వద్దకు చేరుకుని కిందకు ఉన్న విద్యుత్ తీగలను తొలగించారు.



విద్యుత్ తీగలను తొలగించిన దృశ్యం

అనంతపురం వైశ్యాహాస్టల్ ట్రస్టు సెక్రటరీగా శివ రామాంజనేయులు



నార్పల : అనంతపురం వైశ్యాహాస్టల్ ట్రస్టు సెక్రటరీగా నార్పలకు చెందిన సీనియర్ జర్నలిస్టు ఇటికాల శివ రామాంజనేయులు నియమితులయ్యారు. ఈయన ఈ పదవిలో మూడేళ్లపాటు కొనసాగనున్నారు. ఈ సందర్భంగా ఈనెల 18న అనంతపురం వైశ్యా హాస్టల్ మీటింగ్ హాల్లో ప్రమాణం స్వీకారం చేయనున్నారు.

బ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా శంకర్‌నారాయణశర్మ

రాయదుర్గం : రాయదుర్గం బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులుగా శంకర్ నారాయణశర్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో శంకర్ నారాయణశర్మను ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గ సభ్యులను 10 రోజుల తర్వా సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసి ఎన్నుకోనున్నట్లు తెలిపారు.



సంఘం అధ్యక్షులను సన్మానిస్తున్న దృశ్యం

మంత్రి లోకేష్‌ను కలిసిన దండు శ్రీనివాసులు



నారా లోకేష్‌కు బొకే అందజేస్తున్న దండు శ్రీనివాసులు

శింగనమల : జిల్లా పర్యటనకు వచ్చిన ఐటి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా బొకే అందజేశారు. అంతేగాకుండా అడ్డుగడుగునా లోకేష్‌కు స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు.

కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడుని కలిసిన నాయకులు

శింగనమల : అనంతపురంలో జరిగిన ఓ శుభకార్యానికి వచ్చిన కేంద్ర పౌర విమాన శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్‌నాయుడును మండల టిడిపి నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా బొకే అందజేశారు. కేంద్ర మంత్రిని కలిసిన వారిలో తెలుగు యువత రాష్ట్ర మాజీ కార్యదర్శి మాసూలు చంద్రమోహన్, టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి బిసి నాగేంద్ర ఉన్నారు.

గజేంద్ర వాహనంపై వెంకటరమణుడు

రాయదుర్గం : పట్టణంలో వెలసిన ప్రసన్న వెంకటరమణ స్వామి శుక్రవారం గజేంద్ర వాహనంపై విహరించారు. కోటలోని వెంకటరమణ స్వామి ఆలయం నుంచి వినాయక కూడలి మీదుగా లక్ష్మీబజార్ వరకూ ఊరేగింపు కొనసాగింది. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ, ఆర్యవైశ్య, వీరశైవ లింగాయత్, శ్రీవైష్ణవ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

నారా లోకేష్‌ను కలిసిన అపుస్మా నాయకులు

అనంతపురం : జిల్లా పర్యటనకు వచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను జిల్లా ప్రయివేట్ పాఠశాల యాజమాన్య సంఘం నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఇందులో భాగంగా ప్రయివేట్ పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించి వినతిపత్రం అందజేశారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందిస్తూ ప్రయివేటు పాఠశాల సమస్యల పరిష్కారానికి విద్యాశాఖ అధికారులతో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అనంతపురం జిల్లా ప్రయివేట్ పాఠశాల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా కార్యదర్శి ఎస్.రవిశంకర్, ప్రసాద్, గౌరవాధ్యక్షుడు నాయుడు, స్టేట్ కోఆర్డినేటర్ కుసుమ పుల్లారెడ్డి, నాగరాజు, గాజుల చంద్ర, శశిభూషణ్, రామచంద్రరెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి

పుట్లూరు : రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతిచెందిన ఘటన మండల పరిధిలోని గాండ్లపాడు-తాడిపత్రి రోడ్డు సమీపంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని తక్కలపల్లి గ్రామానికి చెందిన విజయలక్ష్మి కూతురు లక్ష్మీనరసమ్మ గురువారం తక్కలపల్లి నుంచి ద్విచక్ర వాహనంలో తాడపత్రికి బయలుదేరారు. అయితే గాండ్లపాడు సమీపంలోకి రాగానే వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. దీంతో ఇద్దరికీ గాయాలు కావడంతో వెంటనే తాడపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మీనరసమ్మ (17) పరిస్థితి విషమించి శుక్రవారం తెల్లవారుజామున మృతిచెందింది. కాగా కుటుంబ సభ్యులు విద్యార్థి కళ్లదానానికి ముందుకు రావడంతో వైద్యులు కళ్లను సేకరించారు.

నిందితుడు అరెస్టు.. బంగారు, వెండి ఆభరణాలు స్వాధీనం

రాయదుర్గం : రాయదుర్గం రూరల్ పోలీస్ సర్కిల్ పరిధిలోని కనేకల్ క్రాస్ వద్ద శుక్రవారం ఉదయం ఓ నిందితుడిని అదుపులో తీసుకుని రూ.48లక్షల విలువజేసే బంగారు నగలు, వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ తెలిపారు. శుక్రవారం సాయంత్రం సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కణేకల్ క్రాస్ వద్ద వాహనాల తనిఖీ నిర్వహిస్తుండగా కళ్యాణదుర్గానికి చెందిన పిట్ల గంగాధర్ అలియాస్ సాంబను అదుపులోకి తీసుకుని విచారించగా బ్యాగులో బంగారు, వెండి వస్తువులు కనిపించాయన్నారు. పూర్తిస్థాయిలో విచారించగా పలు విషయాలు బయటకు వచ్చాయన్నారు. నిందితుడిపై ఆంధ్ర, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల్లో 40 కేసులు నమోదవడంతోపాటు, కొంతకాలం పాటు జైలు శిక్షను కూడా అనుభవించినట్లు వెల్లడైందన్నారు. గత ఏడాదిన్నర కాలంగా ఎనిమిది కేసులకు సంబంధించిన చోరీ సొమ్మును రికవరీ చేసినట్లు తెలిపారు. పలు కేసులకు సంబంధించిన 45.5 తులాల బంగారు నగలు, 2.275 కిలోల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి విలువ రూ.48లక్షలు ఉంటుందన్నారు. నిందితుడిని పట్టుకోవడంతో రూరల్ సర్కిల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, కనేకల్ ఎస్ఐ నాగమధు, బొమ్మనహాల్ ఎస్ఐ నబిరసూల్, సిబ్బందిని ఎస్పీ జగదీష్‌తోపాటు కళ్యాణదుర్గం డీఎస్పీ రవిబాబును అభినందించారు. ఈ సమావేశంలో రూరల్ ఇన్స్‌పెక్టర్ వెంకటరమణ, ఎస్ఐలు నాగమధు, నబి రసూల్ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ దూసుకెళ్లి 24 గొర్రెలు మృతి

గుత్తి : మండలంలోని ఊబిచెర్ల గ్రామ శివారులో 44వ జాతీయ రహదారిపై శుక్రవారం గొర్రెల మందపై లారీ దూసుకెళ్లి 24 గొర్రెలు మృతి చెందాయి. పోలీసులు, కాపరులు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కాపరులు రాముడు, నారాయణస్వామి, శివశంకర్ గొర్రెల పెంపకంతో జీవనం సాగించేవారు. ఈ క్రమంలో గొర్రెలను మేతకు తొలుకెళ్తూ ఊబిచెర్ల గ్రామ శివారులో జాతీయ రహదారి దాటుతుండగా హైదరాబాదు నుంచి బెంగళూరు వైపునకు వెళ్తున్న లోడు లారీ మందపై నుంచి దూసుకెళ్లింది. దీంతో అక్కడికక్కడే 24 గొర్రెలు మతిచెందాయి. మరికొన్ని గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. గొర్రెల మృతితో రూ.3 లక్షలు నష్టం వాటిల్లిందని రైతులు కన్నీరు మున్నీరుగా విలపించారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. గొర్రెలపై నుంచి దూసుకెళ్లిన లారీని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. అనంతరం బాధిత రైతులు ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.